***స్థలం:*** టెక్సాస్

***తేదీ:*** అక్టోబర్ 14, 2006

***సందర్భం:*** బాపు గారికి లైఫ్ టైమ్ ఎఛీవ్‌మెంట్ అవార్డు ప్రదానోత్సవం

***నేపథ్యం:*** బాపుగారి తరుఫున ముళ్ళపూడి వారు వ్రాసిచ్చిన ప్రసంగమిది

***జరిగింది:*** బాపుగారు ఎలానూ వేదిక మీద మాట్లాడరు కాబట్టి పప్పు వేణుగోపాల రావుగారు దీన్ని ప్రేక్షకులకి చదివి వినిపించారు.

సభకు నమస్కారం

శ్రీ వంగూరి చిట్టెన్ రాజుగారు మా దేశం వచ్చి నన్నూ ముళ్ళపూడి వెంకట రమణగారినీ ఎంతో ప్రేమాభిమానాలతో ఈ సభకి ఆహ్వానించారు. రమణగారు రాలేనన్నారు. మౌనంగా ఉన్న నన్ను చూసి - నాకు సభాకంపం జనగండం ఉందని తెలిసీ, తమ సహజ హాస్యధోరణిలో - మీరన్నా వచ్చి నాలుగు ముక్కలు మాట్లాడండి అన్నారు రాజుగారు. అంశం "సాహిత్యములో హాస్యం."

నిఘంటువు చూశాను. సాహిత్యం అనగా సాహచర్యము, మైత్రి, సంఘము, సంఘటన, కావ్య వాఙ్మయము, కవిత్వము కావ్యశాస్త్రము, సామగ్రిసంకలనము, భోజనావసర వస్తువుల మొత్తము - అనిన్నీ, హాస్యము అనగా నవ్వతగినది, నవరసములలో నొకటి, నవ్వు, సంతోషము వేళాకోళము, -ఆక్షేపము అని ఉంది.

అందాల రాముడు రాజబాబు అన్నట్టు నాకు తెలుగే సరిగ్గా రాదు. సంస్కృతం నిల్లు. అందుచేత నాకేం తోచక ఇద్దరి తరపునా - సాహిత్యం అంటే మైత్రి అనివుంది కదా ఏదేనా చెబితే రాసుకుని చదువుతాను అని రమణగారిని అడిగాను.

ఇలా చెప్పారు.

శ్రీ చిట్టెన్ రాజుగారి మధుర వాక్యంతో మొదలెడదాం.

"అయ్యా నమస్కారం"

"స్కారం"

"రేపాదివారం తమరికి సన్మానం"

"ఎందుకూ?"

"తమరు గొప్పవారు కనక"

"అలాగా! అలాక్కానీండి. చేసుకోండి"

"థిక్ నువ్వేం పెద్దమనిషివయ్యా - మర్యాదకి - మాటవరసకి నువ్వోహ గొప్పవాడివీ అంటే - అవును మరేస్మీ అని ఠంగున ఒప్పేసుకుంటావా! సన్మానం చెయ్యమ్మటావా!!"

"అదీ రైటే - అయితే నేను మీరన్నట్టు ఒహ గొప్పవాణ్ణికాను. సన్మానాలకి తగను"

"థిక్ - ఎడ్డెమంటే తెడ్డెమంటావ్. సన్మానం చేస్తామయ్యా మగడా అని దేవులాడితే నేను తగనూ సన్నాసినీ అని పొమ్మంటావా - మాకు బుర్రలేదా? టేస్టులేని ఏబ్రాసులమా? నువ్వుగొప్పవాడివయ్యా అని మేమంటే - కాదూ నేనుత్తి సన్నాసినండీ అని నవ్వంటావా! అది మా జెడ్జిమెంటుకీ మా టేస్టుకీ ఇన్సల్టు కాదయ్యా!"

"అలాగా! అలా వచ్చారా! - సరే - నా ఇష్టం. నేను గొప్పవాడినో వట్టి వెధవాయినో నువు చెప్పేదేవిటీ - నేనే ఢంకా బజాయించి మరీ చెప్పుకుంటాను. గీతలో కృష్ణభగవానుడిలా..."

"ఆయనేం చెప్పాడు?"

"ఏం చెప్పలేదటా!? అన్నిట్లోనూ బెస్టుగార్ని నేనే - జంతువుల్లో సింహాన్నీ, పక్షుల్లో హంసనీ - పువ్వుల్లో గులాబీనీ - మాసాల్లో మార్గశిరాన్నీ - భక్తుల్లో ప్రహ్లాదుడినీ - శత్రువుల్లో హిరణ్యకశిపుడినీ డబ్బులో డాలర్నీ - రచనలో రమణ్ణీ - బొమ్మల్లో బాపునీ."

"ఆగండీ - ఇది కల్తీలేని అహంకారం - ప్యూర్ ఈగో! దేవుడైనా సరే" -

- ఎంత దేవుడైనా ఒంటిమీద ఎన్ని భూషణాలున్నా వినయభూషణం ఉన్నట్టులేదే! "మరే లేనట్టే ఉంది.- మాలాగే! ఇదేకాదు రాజు గారూ.. దీన్ని మించినది ఆ శ్రీహరిగారి గురించి ఇంకో కథ ఉంది. అదితికశ్యపులు పదివేల ఏళ్ళు తపస్సు చేశారు. విష్ణుమూర్తి ప్రత్యక్షం అయి వత్సా వరం కోరుకో అన్నాడు. జగన్నాథా - నీ వంటివాడు పుత్రుడుగా పుట్టాలి అన్నారు వాళ్ళు. భలేవారే! నా వంటివాడు ఇంకోడెక్కడుంటాడుటా! బాగు బాగు. నేనే పుడతానులెండి అన్నాడు శ్రీహరి. ఆయన అబద్ధం చెప్పలేడు కదా! అహంకార దోషం అంటుందని మొహమాట పడలేడు కదా! పైగా మీ బోటివాడు 'మీకు గర్వం కదా శ్రీహరీ అంటే - ఓరి సన్నాసీ! గర్వం నాక్కాపోతే నీకా ఉంటుంది అని నవ్వేస్తాడు."

రాజుగారు - "ఈ హరికథలాపేసి అసలు కథకి రండి" అని కోప్పడ్డారు.

****

వస్తున్నాం - మేము ఒహ గొప్పాళ్ళం కాదు. ఇద్దరు గొప్పాళ్ళం - ముప్పాళ్ళ రంగనాయకమ్మగారిలా

గోదారి కెడా పెడాగా - నేను తూగోజీలో - బాపు పగోజీలో పుట్టాంట. అపుడు ప్రపంచంలో పూలవాన కురవలేదు. ప్రళయాలేం రాలేదు. గంధర్వులు పాడలేదు. కోకుల్ని కుహూ అనమంటే 'ఉహూ' అన్నాయని గిట్టని వాళ్ళ ప్రచారం. అచ్చరలాడలేదు. దుబాయి టూరెళ్ళాయుట. పేపర్లు సప్లిమెంట్లు వేయలేదు. టీవీ యాంకర్లు హలో బాపూ అండీ హలో రవణాంకుల్ అని గ్రీటింగ్స్ చెప్పలేదు. భూ చక్రంలో భూమండలంలో ఆ రోజు తెల్లారగానే సూర్యుడు మాములుగానే ఉదయించాడు. ఆ రాత్రి చంద్రుడు కూడా అలవాటు ప్రకారం వెన్నెలే కాశాడు. చుక్కలు తళుకు తళుకుమన్నాయి కొబ్బరాకులు మిలమిలమన్నాయి. పువ్వులు పూశాయి. పిల్లలు అల్లర్లు చేశారు. రెండు జెళ్ళ సీతలు బాపు బొమ్మల కోసం పోజులు పెడుతూ రెండుజెళ్ళ లేళ్ళలా చెంగుచెంగున దూకుతున్నారు. బాబాయిగాళ్ళ ఒంటి కాళ్ళమీద తపస్సులు చేస్తూ గడ్డాలు గీసుకుంటున్నారు. అప్పారావులు అప్పులు చేసేస్తున్నారు. ఎగేస్తున్న వారవుతున్నారు. క్రిష్ణశాస్త్రుళ్ళు (ఉన్నదీ ఉండేదీ ఒక్కడే) పొయెట్రీలు రాసేస్తున్నారు. గిరీశాలు లంక చుట్టల కొసలు కొరికి ఫట్ మని బుచ్చెమ్మల వైపు గురికొడుతున్నారు. ఇల్లాళ్ళు కూరల కావిళ్ళ దగ్గర కూరలు బేరాలు చేస్తున్నారు. వావిళ్ళ వారి కోడళ్ళకి

వేవిళ్ళవుతున్నాయి. అగ్నిహోత్రావధాన్లు అంకాళమ్మ గుడి చాటు సంతలో బుచ్చమ్మ చెల్లి పెళ్ళికి కన్యాశుల్కం బేరాలు నడుపుతున్నాడు. మధురవాణి బారెడు జడను గిర్రున తిప్పి రామప్పంతులు నడ్డివిరగ్గొడుతోంది. అజ్జాసి మంచి వాళ్ళ బుర్రల్లో దుష్టాలోచనలు తళుక్కుమని చెంపలేసుకుంటున్నారు. చెడ్డవాళ్ళకి మంచాలోచన పుట్టి గతుక్కుమని థూ థూ అనుకుంటున్నారు విశ్వనాథవారిలా. నేను 1931లో పుట్టి కెవ్వుమనగానే ఆ అరుపుకి తెలుగు మూకీలు మేలుకుని టాకీలయి పోయి సినిమాలో భక్తప్రహ్లాదుడికి మాటలొచ్చేశాయి. అన్నట్టు మరిచాను - అంతకు ముందే రాజేసిన కుంపటి మీద అంతకు ముందే పెట్టి మాలతిగారు మర్చిపోయిన మాడిన వేడి మూకుడులో అంతకు ముందే తరిగి ఉంచుకున్న కూరముక్కల్ని వెయ్యగానే అవి చుయ్ చుయ్ మన్నాయి. అది విని కావు కావుమన్నాయి కాకులు. దేవుడా కావుకావుమన్నారు లోకులు. ఇవు ఇవ్వుమన్నారు పేదలు. లెవ్వు లెవ్వు అన్నారు లోభులు - ముద్దు ముద్దు అన్నారు ముగుళ్ళు. వద్దు వద్దు అన్నారు ఇల్లాళ్ళు.

ఈ ప్రకారంగా బాపు రమణల పుట్టడాలు పెరగడాలు కారం అప్పడాలూ, వడియాలూ ఏ ఒడిదుడుకులు లేకుండా సూర్యమండల చంద్రమండల భూ మండల ఉభయ గోదావరి మండలాలలో జీవకోటికి అలవాటైన బాటలోనే చంద్రబాబు గారిలాగా ‘ముందుకు పోతా‘ ఉండగా నేను 76వ మైలురాయి దగ్గరా బాపు 74 దరిదాపుల్లోనూ తేలాం.

అందువల్ల ఇంత గొప్ప అవధానం చేసినందుకు గర్విస్తున్నాము. ఎందువల్లనంటే అవధానంలో అప్రస్తుత ప్రసంగం ఉంది గనుక.

ఓపిగ్గా విన్న పెద్దలకు మనసారా నమస్కారాలు. పిన్నలకు వయసారా దీవెనలు.

(ఈ ప్రసంగపాఠం ఒరిజినల్ ప్రతిని ‘కౌముది‘కి అందించిన చిట్టెన్ రాజు గారికి కృతజ్ఞతలు)

Click here to share your comments on this article